నేటి కందం- నేటికి అందం

లాలించు తల్లి పార్వతి
పాలించెడి పరమశివుడు పరవశు లగుచున్
హోలీ పర్వదినంబున
చాలగ శుభముల నిడెదరు సర్వ జనులకున్ !!

(హోలీ పండుగ శుభాకాంక్షలు)



-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

శాంతికొరకే యుద్ధమంటూ
చేస్తున్నరు నరమేధం
స్మశానంలో సంచరిస్తూ
చదువుతుంద్రు రణవేదం.
ఆధిపత్య పిచ్చి ముదిరి
హంతకులై పోతున్నరు
బలహీనపు దేశప్రజల
బతుకు కూల్చివేస్తున్నరు.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 3-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:168 పేజీలు:6 వెల: రూ.1/-

# నాటాంజ్ అణుక్షేత్రంపై యూఎస్, ఇజ్రాయెల్ దాడి..

## -ఇరాన్ రాయబారి సంచలన ప్రకటన



టెహ్రాన్: మార్చి 2:అమెరికా, ఇజ్రాయెల్ తాజాగా నాటాంజ్‌లోని ఇరాన్ ప్రధాన అణుక్షేత్రం పై దాడి చేసినట్టు ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ లో ఇరాన్ రాయబారి రెజా నజాఫి తెలిపారు. అయితే దీనిని ఐక్యరాజ్యసమితి అణు నిఘా సంస్థ ఖండించింది. అణుక్షేత్రంపై దాడి జరిగిందనడానికి ఎలాంటి సాక్ష్యం లేదని తెలిపింది.

ఇరాన్‌పై సైనిక చర్యను ఇప్పటికే అమెరికా-ఇజ్రాయెల్ సమర్థించుకున్నాయి. ఇరాన్ అణుసామర్థ్యాన్ని అడ్డుకోవడం ఒక ప్రధాన కారంగా తెలిపాయి. సొంతంగా అణ్వాయుధం తయారీ తుది దశలో ఇరాన్ ఉందని కూడా ఆ రెండు దేశాలు చెబుతున్నాయి.

### అణుక్షేత్రంపై దాడి చట్టవిరుద్ధం

నాంటాజ్‌లోని అణుక్షేత్రంపై ఇజ్రాయెల్-యూఎస్ దాడి జరపడం చట్టవిరుద్ధమని రెజా నాజాఫీ ఆరోపించారు. ఇది పూర్తిగా నేరపూరిత, అనారిక చర్య అని అన్నారు. ఇరాన్ శాంతియుత సురక్షిత అణు సౌకర్యాలపై ఆదివారంనాడు మరోసారి దాడి జరిగిందని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయాలనుకోవడం పూర్తిగా అబద్ధమని చెప్పారు. కాగా, నాటాంజ్‌లోని అణుక్షేత్రంపై దాడులను అమెరికా కానీ, ఇజ్రాయెల్ కానీ ఇంతవరకూ ధ్రువీకరించలేదు.

### ఎలాంటి సంకేతాలు లేవన్న ఐఏఈఏ డైరెక్టర్ జనరల్

మరోవైపు, ఇరాన్ అణు సౌకర్యాలపై దాడి జరిగినట్టు ఎలాంటి సంకేతాలు లేవని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ తెలిపారు. ఈ విషయంలో ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అధికారులతో సంప్రదించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. అయితే ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇరాన్ సరిహద్దు దేశాల్లో రేడియేషన్ స్థాయిలు పెరిగిన సంకేతాలు కూడా లేవని చెప్పారు.

# నెతన్యాహు కార్యాలయంపై క్షిపణి దాడి... ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడి



టెహ్రాన్: మార్చి 2: మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేసింది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయాన్ని తమ క్షిపణి విజయవంతగా ఢీకొట్టిందని ప్రకటించింది. దాడి జరిగినట్టు చెబుతున్న సమయంలో నెతన్యాహు తమ కార్యాలయంలో ఉన్నారా లేదా అనేది ఇంకా తెలియలేదు.

'క్రిమినల్ ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు, ఎయిర్ ఫోర్స్ కమాండర్ కార్యాలయాన్ని ఖైబర్ షెకాన్ బాలిస్టిక్ క్షిపణి విజయవంతంగా ఢీకొట్టింది' అని ఆర్ఆర్‌జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఇరాన్ ప్రకటనను ఇజ్రాయెల్ ఇంకా ధ్రువీకరించలేదు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని మరణించడంతో మధ్యప్రాచ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. ఇరాన్ ఆదివారం జరిపిన క్షిపణి దాడుల్లో జెరూసలేం సమీపంలోని బీట్ షెమేష్‌లో 10 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగుతాయని ఇరాన్ ప్రకటించింది. దీనిపై ఇజ్రాయెల్ అంతే వేగంగా స్పందించింది. ఇరాన్ ప్రతిదాడులకు దిగితే మునుపెన్నడూ ఎరుగని రీతిలో భయంకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది.

# హెజ్‌బొల్లాకు బిగ్ షాక్.. ఇజ్రాయెల్ దాడుల్లో కీలక నేత మృతి



లెబనాన్, మార్చి 02: పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. లెబనాన్ లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన భీకరవైమానిక దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హెజ్‌బొల్లా బ్లాక్ అధిపతి మహ్మద్ రాడ్ మరణించారు. ఆయన మృతి చెందినట్లు సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్త 'అల్ హదత్' పేర్కొంది.

దక్షిణ లెబనాన్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇవాళ(సోమవారం) ఇజ్రాయెల్ రక్షణ దళం (ఎఆఈ) వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో మహ్మద్ రాడ్ (ఓనీష్ఠజీఎఎజీట ఖీజీజీట) మృతి చెందారు. ఈ ఉగ్రసంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో మృతి చెందారని ఐడీఎఫ్ తెలిపింది. అయితే వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 31 మంది మృతిచెందగా.. 149 మంది గాయపడినట్లు లెబనాన్ ప్రకటించింది.

హెజ్‌బొల్లా నేతలు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్ కోసం ఎక్కువ పని చేశారని, వారి చర్యలకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఐడీఎఫ్ అధికారి రఫీ హెచ్చరించారు. మొదట హెజ్‌బొల్లా తమపై రాకెట్ దాడులకు పాల్పడడం వల్లే ప్రతి దాడులు చేశామని ఆయన తెలిపారు. మరోసారి వారు ఇటువంటి చర్యలకు దిగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా.. లెబనాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, కీలక నేతల కార్యాలయాలపై దాడులు చేపట్టామన్నారు.

హెజ్‌బొల్లా రాజకీయ, సైనిక విభాగాల్లో కీలక పాత్ర పోషించే రాడ్ మృతి ఆ సంస్థకు కోలుకోలేని దెబ్బని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హెజ్‌బొల్లా ఆయుధాలను, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ 'ఆపరేషన్ రోరింగ్ లయన్'ను వేగవంతం చేసింది. మరిన్ని దాడులు చేయడానికి ముందు దక్షిణ లెబనాన్‌లోని 50 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా అక్కడి ప్రజలకు సూచించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు.

# ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు : డొనాల్డ్ ట్రంప్

అమెరికామార్చి 2:ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగైదు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని అన్నారు.

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా తనపై గతంలో జరిగిన హత్యాయత్నాల ఘటనలను ఆయన ప్రస్తావించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయని, కానీ నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథ కంచికి చేర్చా' అని పేర్కొన్నారు. 'నన్ను పట్టుకోక ముందే నేనే అతడిని పట్టుకొన్నా' అని చెప్పారు.

ఇరాన్ పై ఆపరేషన్ క్లిష్టమైనదేనని, కానీ విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నామని ట్రంప్ అన్నారు. అవసరమైతే ఈ ఆపరేషన్ నాలుగైదు వారాలు కొనసాగవచ్చునని తెలిపారు. యుద్ధ తీవ్రతను ఇదేవిధంగా కొనసాగించడం ఇజ్రాయెల్ , అమెరికాకు కష్టమేమీ కాదని అన్నారు. చర్చల కోసం తమ దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయని తెలిపారు.

కాగా ఇరాన్‌పై ఆపరేషన్‌లో ఇప్పటివరకు అమెరికా కు చెందిన ముగ్గురు సైనికులు మరణించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. తమ సైనికుల మృతికి ప్రతీకారం

తీర్చుకుంటామన్నారు. అయితే యుద్ధం ముగిసేలోపు మరింత ఎక్కువ మంది అమెరికా సైనికులు మృతిచెందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్‌లో దాదాపు 200 మంది మరణించారు. ఖమేనీతో పాటు పలువురు సీనియర్ మిలిటరీ కమాండర్‌లు, రాజకీయ ప్రముఖులు కూడా మృతి చెందినట్లు సమాచారం.

ఇదిలావుండగా.. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పిస్తామనిట్రంప్ వెల్లడించారు. లేదంటే వారికి చావు తప్పదని హెచ్చరించారు.

# సౌదీ, బహ్రెయిన్ నేతలకు మోదీ ఫోన్.. భారతీయుల భద్రతపై ఆరా



న్యూ ఢిల్లీ, మార్చి 2:ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు.

కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో మాట్లాడారు. ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి కూడా మోదీ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాల, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై సమావేశంలో చర్చించారు.

# పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం.. పరిస్థితులను పర్యవేక్షిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 2: మధ్య ప్రాచ్యంలో(పశ్చిమాసియా) నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్య ప్రాచ్యం (పశ్చిమాసియా) ప్రాంతం లో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది.

తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24లీ7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది.

ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం: సీఎం రేవంత్



వికారాబాద్, మార్చి 02: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు.

ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు.

తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

# రాజ్యసభ సభ్యుల ఎంపికపై కీలక చర్చ..



వికారాబాద్, మార్చి 02: వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగింది. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది.

# ఇది ముగింపు లేని యుద్ధం కాదు: యూఎస్ మంత్రి పీటర్ హెగ్సెత్

అమెరికామార్చి 2:ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌పై దాడులను ఇరాక్ యుద్ధంతో పోల్చకూడదని అమెరికా యుద్ధ శాఖ మంత్రి పీటర్ హెగ్సెత్ సోమవారం మీడియాతో అన్నారు. ఇరాక్ తరహా ఊబిలోకి అమెరికా పడదలుచుకోలేదని స్పష్టం చేశారు. ఇది ముగింపు లేని యుద్ధం ఎంత మాత్రం కాదని అన్నారు. ఇరాన్ సైనిక శక్తి, అణు లక్ష్యాలను కూల్చేందుకే నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ఇరాన్‌ను ఆక్రమించుకోవాలనో లేదా దేశాన్ని మళ్లీ పునర్నిర్మించాలనో తమ ఉద్దేశం కాదని అన్నారు. ఇరాన్ మిసైళ్లు, డ్రోన్స్, నావికాదళాలు, అణు కార్యక్రమాన్ని టార్గెట్ చేస్తూ ఈ మిషన్ ప్రారంభించామన్నారు. ఇరాన్ మొండిఘటంగా మారిందని అన్నారు. తమ సహనం నశించిందని చెప్పారు. ప్రపంచ నౌకాయాన మార్గాలకు రిస్క్ పెరిగిందని అన్నారు. భారీ స్థాయిలో ఇరాన్ ఆయుధాలను సమకూర్చుకుందని అన్నారు. సంప్రదాయక ఆయుధాలతో తన అణు కార్యక్రమానికి రక్షణ కవచాన్ని ఇరాన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. అణ్వాయుధ అభివృద్ధి గురించి అసత్యాలు చెబుతూనే తమ నెత్తికి గన్ను గురిపెట్టిందని అన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణలో వన్యప్రాణులు !

## (03 మార్చి "ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం" సందర్భంగా)

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించు కోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

### భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ జలం, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్ధకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, అవసర హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 03 మార్చి "ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం" లేదా "వరల్డ్ వైల్డ్‌లైఫ్ డే" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

### 2026 ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఇతివృత్తం:

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయనే భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుసుకొనుటతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా అందించి సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉ ఒంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస పేర్కొనడం విశేషం. "ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా" అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ వన్యప్రాణుల దినం-2026 ఇతివృత్తంగా "ఔషధ, ఆరోమాటిక్ మొక్కలు : ఆరోగ్య, వారసత్వ, జీవనోపాధి సంరక్షణ" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది.

### ప్రపంచ వన్యప్రాణుల దినం వేదికగా చేయదగిన కార్యక్రమాలు:

ప్రపంచ వన్యప్రాణుల దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తూనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హెచ్‌పీవీ టీకా ప్రచారం అజ్మీర్ నుంచి ప్రారంభమైంది. ఇది దేశంలోని మహిళా శక్తిని శక్తిమంతం చేసే దిశగా ఒక కీలక అడుగు: ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మార్చి 2:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు అజ్మీర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాజస్థాన్ అభివృద్ధి ప్రయాణంలో ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా సుర్సురాలోని తేజాజీ ధామ్ వంటి ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వ కేంద్రాలకు, హైఫా విముక్తిలో కీలక పాత్ర పోషించిన మేజర్ దల్పత్ సింగ్ వీరత్వానికి నివాళులర్పించారు. మేజర్ దల్పత్ సింగ్ ధైర్యసాహసాలు నేటికీ ఇజ్రాయెల్‌లో గౌరవం పొందు తున్నాయని ప్రధానమంత్రి తెలిపారు.

రాజస్థాన్‌లోని 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' రెండు సంవత్సరాల వేగవంతమైన పురోగతిని పూర్తి చేసుకోవడంపై ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. "ప్రజలకు సేవ చేసేందుకు ఏ అభివృద్ధి హామీలతో అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో వాటిని క్రమంగా నెరవేరుస్తోంది. ఈ అభివృద్ధి ఉద్యమన్ని మరింత వేగవంతం చేసే రోజు ఇది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్, నీరు, ఆరోగ్యం, విద్య వంటి వివిధ రంగాలలో సుమారు రూ. 17,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయని ప్రధానమంత్రి తెలిపారు. ఇవి రాజస్థాన్ ప్రజల సౌకర్యాలను పెంచడమే కాకుండా, యువతకు అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు.

నేడు 21,000 మందికి పైగా కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేయడం ద్వారా రాష్ట్ర యువతకు కొత్త శకం ప్రారంభమైందని శ్రీ మోదీ అన్నారు. దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రచారాన్ని అజ్మీర్ నుంచి ప్రారంభిస్తూ.. ఇది భారతదేశ మహిళా శక్తిని సాధికారం చేయడంలోను, తల్లులు, కుమార్తెల ఆరోగ్యాన్ని కాపాడటంలోను కీలకమైన చర్య అని అభివర్ణించారు. "కుటుంబంలో తల్లి అనారోగ్యం పాలైతే ఇల్లంతా చెల్లాచెదురవుతుందని మనందరికీ తెలుసు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ప్రతి సంక్షోభాన్ని ధైర్యంగా ఎదుర్కోగలదు. ఇదే భావనతో మహిళలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది" అని ప్రధాన మంత్రి మోదీ పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యం, గౌరవం పట్ల ప్రభుత్వానికి ఉన్న సున్నితమైన దృక్పథాన్ని ప్రధాన మంత్రి వివరించారు. టాయిలెట్ల నిర్మాణం, శానిటరీ ప్యాడ్ల పంపిణీ, ఉజ్వల గ్యాస్ పథకం వంటి పరిష్కారాలను అత్యంత ప్రాధాన్యతతో విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భధారణ సమయంలో పౌష్టికాహారాన్ని అందించేందుకు సోదరీల ఖాతాల్లో రూ. 5,000 జమ చేసే సురక్షిత మాతృత్వ పథకాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో ఉన్న నిర్లక్ష్యపు సంస్కృతిని వీడి, సున్నితత్వంతో కూడిన బాధ్యతాయుత పాలన వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు.

మౌలిక సదుపాయాల గురించి మాట్లాడుతూ.. రోడ్డు, రైలు, విమానయాన రంగాల్లో ఆధునిక అనుసంధానం రాజస్థాన్ తలరాతను మారుస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అజ్మీర్-పుష్కర్ వంటి ప్రాంతాల్లో మెరుగైన ప్రయాణ సౌకర్యాలు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తాయని, ఇది స్థానిక వ్యాపారులు, కళాకారులు, టాక్సీ డ్రైవర్లకు మద్దతుగా నిలుస్తుందని ఆయన వివరించారు. ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్ చుట్టూ నిర్మితమవుతున్న మౌలిక సదుపాయాలు రాజస్థాన్‌ను ప్రపంచ పెట్టుబడులకు 'అవకాశాల గని'గా మారుస్తున్నాయని శ్రీ మోదీ అన్నారు.

ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుతున్న తీరు గురించి శ్రీ మోదీ ప్రసంగించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సు గురించి, భారతదేశ దేశ ప్రగతిని, శౌర్యాన్ని ప్రశంసించిన తన ఇజ్రాయెల్ పర్యటన గురించి ప్రస్తావించారు. "ప్రపంచంలోని అనేక దేశాల ప్రధానమంత్రులు, అధ్యక్షులు ఈ సదస్సుకు వచ్చారు. పెద్ద కంపెనీల అధినేతలు వచ్చారు. ప్రతి ఒక్కరూ భారత్‌ను బహిరంగంగా ప్రశంసించారు" అని ప్రధాన మంత్రి మోదీ పేర్కొన్నారు.

గత 11 ఏళ్లలో భారత సాయుధ దళాల విజయాలను ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ ఇలా అన్నారు. "భారత సైన్యం ప్రతి సందర్భంలోను ఉగ్రవాదులకు, దేశ శత్రువులకు గట్టి దెబ్బ కొట్టింది. ప్రతి మిషన్‌లోనూ, ప్రతి సరిహద్దులోనూ మన సైన్యం విజయం సాధించింది. సర్జికల్ స్ట్రైక్స్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు మన సైనికులు తమ సత్తా చాటారు" అని కొనియాడారు.

రైతుల దీర్ఘకాల సమస్యలను ప్రస్తావిస్తూ.. ఈఆర్‌సీపీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. 'పార్వతీ- కాళిసింధ్-చంబల్', 'యమునా-రాజస్థాన్' నదుల అనుసంధాన ప్రాజెక్టుల ద్వారా ఝలావర్, బరాన్, కోట, బండి ప్రాంతాల రైతులకు నిర్దిష్ట, గణనీయమైన ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు.

రాజస్థాన్‌కు సూర్యరశ్మి ద్వారా శ్రేయస్సు పొందే అపారమైన సామర్థ్యం ఉందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.78,000 ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు

. రాజస్థా న్‌లో ఇప్పటికే 1.25 లక్షలకు పైగా కుటుంబాలు ఈ పథకంలో చేరాయని, దీనివల్ల చాలా ఇళ్లలో విద్యుత్ బిల్లులు దాదాపు సున్నాకి చేరుకుంటున్నాయని చెప్పారు. 'వికసిత్ రాజస్థాన్ ద్వారా వికసిత్ భారత్' అనే మంత్రాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుభిక్షమైన, సంపన్నమైన జీవితాన్ని గడపాలన్నదే తన దార్శనికత అని శ్రీ మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

# రైతులకు చట్టబద్ధ భరోస కల్పిస్తున్న ప్రభుత్వం..

అమరావతి, మార్చి 2: రైతుల భూ హక్కులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గంపల గూడెం మండలం, పెద కొమిర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 21.8 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ జరుగుతున్నాయని, అందులో భాగంగా తిరువూరు నియోజకవర్గంలో 9,677 మంది రైతులకు ఈ పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భూ హక్కు పత్రాలపై పార్టీ రంగులు, నాయకుల చిత్రాలు ముద్రించడం వల్ల ప్రభుత్వ పథకాలు పార్టీ ప్రచారంగా మారాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు.

పట్టాదారు పాస్ పుస్తకం అనేది రైతు హక్కును నిరూపించే చట్టబద్ధ పత్రం కావడంతో, ప్రస్తుతం వాటిని పూర్తిగా ప్రభుత్వ అధికార రాజముద్రతో అందిస్తున్నట్లు పేర్కొన్నారు.పాస్ పుస్తకాలలో ఎలాంటి తప్పులు ఉన్నా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ వివాదాలను వేగంగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులకు సులభంగా సేవలు అందించేందుకు రెవెన్యూ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. భూ హక్కుల పత్రాల్లో పారదర్శకత, స్పష్టత పెంపు ద్వారా భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గంపలగూడెం మండల రెవెన్యూ అధికారులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న జిల్లా తెదేపా అధ్యక్షురాలు



అమరావతి, మార్చి 2: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెను వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

ఆలయ అధికారిణి నేల సంధ్య స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆమెతో పాటు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రేగళ్ల లక్ష్మి అనిత, తెదేపా సీనియర్ నాయకుడు చెరుకూరి రాజేశ్వరరావు, ఆలయ మాజీ అధ్యక్షుడు బెల్లం మధుసూదన్ రావు, మాజీ సభ్యుడు వనమా చిన్న అనంతరామయ్య, గ్రామ తెదేపా అధ్యక్షుడు వడ్లమూడి రాజశేఖర్, నియోజకవర్గ, మండల నాయకులు ఉన్నారు. అదేవిధంగా ఆలయం వెలుపల సేంద్రీయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్, మహిళల ఆటల పోటీలు ప్రారంభించారు.

# తారు రోడ్డుకు 1.39 కోట్ల నిధులు..



అమరావతి, మార్చి 2: ఎన్‌హెచ్-65 నుండి ముళ్లపాడు గ్రామం వరకు గతుకులతో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కృషితో మొత్తం 1 కోటి నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్?65 నుండి ముళ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఒక లేయర్ తారు రోడ్డు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అదేవిధంగా ముళ్లపాడు నుండి మక్కపేట వరకు 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు ప్యాచ్‌వర్క్ పనుల కోసం 39 లక్షలు మంజూరు చేయబడగా, ఆ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమయ్యే పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే తాతయ్య కి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాలకు ఊతమిచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు.

ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, టీడీపీ నాయకులు వెల్ది అప్పారావు, ఐలపోగు వెంకటేశ్వర్లు, రోడ్డు సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల ద్వారా సంతృప్తికరమైన సేవలందించాలి...

## -జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ ని అరకట్టాలి
## -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

అమరావతి, మార్చి 2:అంగన్వాడీల ద్వారా గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు సంతృప్తికరమైన సేవలందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సీడీపీఓలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులతో శాఖ పనితీరుపై డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ..శాఖకు సంబంధించిన సూచికల్లో కర్నూలు జిల్లా చివరి స్థానాల్లో ఉండటం ఆందోళ నకరమని పేర్కొంటూ, దీనిని సవాలుగా తీసుకుని పనితీరులో స్పష్టమైన మార్పులు తీసుకురా వాలని, ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని అధికారు లను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య పరీక్షలు, గర్భిణీలు, బాలింతలు, 0-6 ఏళ్ల పిల్లలకు సకాలంలో, నాణ్యతతో సేవలు అందించాలన్నారు. తీసుకోవాలని ఆదేశించారు.

లబ్ధిదారులతో మర్యా దపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఇది శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్య, ఆట సామగ్రి వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని ఆదర్శ అంగన్వాడీగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. పెద్ద కడబూరు, ఆస్పరి, మంత్రాలయం, కోసిగి, కౌతాళం, హోళగుంద మండలాల్లో సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషణకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్లు వెచ్చిస్తోందని, ప్రతి అర్హుడికి లబ్ధి చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టిన ఈ అంశంపై క్షేత్ర స్థాయిలో బాగా పనిచేసి సేవల నాణ్యతను పెంచాలని డైరెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో టీనేజ్ గర్భధారణలను పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరును గణనీయంగా మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, తక్షణ చర్యల ద్వారా ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించాలని స్పష్టం చేశారు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాల మరమ్మత్తులు మొదటి వారంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ అంశాలపై ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా అధికారులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకో వాలని సూచించారు. రెండవ వారంలో గర్భిణీలు, బాలింత లలో ప్రభుత్వ పథకాలపై, పోషకాహార ప్రాముఖ్యతపై, ప్రజా సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. లబ్ధిదారుల సంతృప్తి స్థాయి పెరగాలని, వారిలో విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని చెప్పారు. పోషకాహార నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ గర్భిణీలు, బాలింతలకు అందించే టేక్ హోమ్ రేషన్ సమయానికి అందజేయాలని ఆదేశించారు. పాలు, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాల నాణ్యతను ముందుగా పరీక్షించి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

# ఇరాన్- ఇజ్రాయెల్ సంక్షోభం.. దుబాయిలో ఇరుక్కుపోయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 2:ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబసభ్యుల చికిత్స కోసం దుబాయ్ వెళ్లిన ఆయన.. విమానాల రద్దుతో అక్కడే ఇరుక్కుపోయారు.

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి తర్వాత గల్ఫ్ దేశాల్లో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ప్రతీకారం తీర్చుకునేందుకు ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతున్నది. యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలతోపాటు విమానాశ్రయాలు, ఇతర సముదాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ క్షిపణుల దాడి చేస్తున్నది. ఈ క్రమంలో దుబాయ్‌లోని ఎయిర్‌పోర్టుల్ని మూసివేశారు. ఫలితంగా విమాన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే తన బంధువులను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడే చిక్కుకుపోయారు.

తన కుటుంబసభ్యుల్లో ఒకరికి అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఐదు రోజుల క్రితం తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌కు వెళ్లారు. ఇంతలోనే దుబాయ్‌పై ఇరాన్ దాడులు చేస్తుండటంతో అక్కడి ప్రభుత్వం అన్ని విమానాలను రద్దుచేసింది. దీంతో దుబాయ్‌లో సురక్షితంగానే ఉన్నప్పటికీ, ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ ఇచ్చేంత వరకు ఇండియాకు తిరిగిరాలేని పరిస్థితి నెలకొంది.

# ఔషధ దుష్ప్రభావాలను నివేదించేందుకు, దేశవ్యాప్తంగా రోగుల భద్రతను పెంపొందించేందుకు ఏడీఆర్ పీవీపీఐ 2.0 మొబైల్ అప్లికేషన్ ఆవిష్కరణ

న్యూ ఢిల్లీ, మార్చి 2:భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ (ఐపీసీ), ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజడ్)తో కలిసి.. ఫార్మాకోవిజిలెన్స్, మెటీరియోవిజిలెన్స్‌ను బలోపేతం చేయటంపై రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. 2026 ఫిబ్రవరి 27 నుంచి 28 వరకు విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజడ్) వద్ద ఆ సదస్సు జరిగింది. భారతదేశంలో ఔషధాలు, వైద్య పరికరాల భద్రతా వ్యవస్థలను పటిష్టం చేసేందుకు.. నియంత్రణా అధికారులు, ఆరోగ్య సంస్థలు, ఏడీఆర్ మానిటరింగ్ కేంద్రాలు (ఏఎంసీలు), వైద్య పరికరాల పర్యవేక్షణ కేంద్రాల (ఎండీఎంసీలు) మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచేందుకు, ఫార్మాకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా (పీవీపీఐ), మెటీరియోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా (ఎంవీపీఐ) ప్రాంతీయ కేంద్రాల మొదటి జాతీయ వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ చర్చల్లో నియంత్రణ సంస్థల ఉన్నతాధికారులు, ప్రముఖ వైద్య సంస్థల ప్రతినిధులు, భారత్‌లోని డబ్ల్యూహెచ్‌వో కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి ఐపీసీ కార్యదర్శి, శాస్త్రీయ డైరెక్టర్ డాక్టర్ వి. కలైసెల్వన్ అధ్యక్షత వహించారు. అవగాహన కల్పించే స్థాయి నుంచి, స్పష్టమైన ఫలితాలతో పనితీరు ఆధారిత ఫార్మాకోవిజిలెన్స్ వ్యవస్థ వైపు మారాల్సిన ఆవశ్యకతను ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ సీనియర్ అధికారి ప్రొఫెసర్ వై.కె. గుప్తా, ప్రొఫెసర్ అశోక్ పురాణిక్, ఏఎంటీజడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ సీఈఓ డాక్టర్ కవితా కచ్రూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఫార్మాకోవిజిలెన్స్, మెటీరియోవిజిలెన్స్ వ్యవస్థలను బలోపేతం చేయటంలో వివిధ సంస్థల పరస్పర సహకారం కీలకమని వివరించారు.

సెషన్ ప్రారంభంలో, దేశవ్యాప్తంగా మందుల దుష్ప్రభావాలను సమయానుగుణంగా నివేదించటాన్ని సులభతరం చేసేందుకు, తక్షణమే సమాచారాన్ని సేకరించే సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు, వాటాదారుల భాగస్వామ్యాన్ని మెరుగుపరిచేందుకు ఏడీఆర్ పీవీపీఐ 2.0 మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు.

పీవీపీఐ, ఎంవీపీఐ ద్వారా జరిగిన పురోగతిని సమీక్షించటానికి, మందుల దుష్ప్రభావాల నివేదన లోపాలు, డాక్యుమెంటేషన్ కొరత, మెటీరియోవిజిలెన్స్‌ను పటిష్ఠం చేయాల్సిన అవసరం వంటి కీలక సవాళ్లపై చర్చించటానికి సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. ఏఎంసీలు, ఎండీఎంసీల పనితీరుని మెరుగుపరచటం, ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో క్రమబద్ధమైన రిపోర్టింగ్ సంస్కృతిని ప్రోత్సహించటంపై చర్చలు దృష్టి సారించాయి.

"భారతదేశ ఫార్మాకోవిజిలెన్స్, మెటీరియోవిజిలెన్స్‌ను బలోపేతం చేయటం: అవగాహన నుంచి ఆచరణ వరకు" అనే ఇతివృత్తంతో సమావేశం రెండో రోజు నిర్మాణాత్మక వర్కింగ్ బృంద చర్చలు జరిగాయి. సాంకేతిక సెషన్లతో పాటు నివేదికల కొరత పరిష్కారానికి, నివారించగల ప్రతికూల సంఘటనల డాక్యుమెంటేషన్, విశ్లేషణకు ప్రామాణిక వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు, జిల్లా స్థాయి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలకు మించి ఫార్మకోవిజిలెన్స్, మెటీరి యోవిజిలెన్స్ విస్తరణ ప్రచారానికి వ్యూహాలను వర్కింగ్ బృందాలు పరిశీలించాయి.

ఈ చర్చల సిఫార్సులు ప్రధానంగా రోగుల భద్రతను పటిష్ఠం చేయటానికి సామర్థ్య పెంపుదల, నివేదన పద్ధతుల ప్రామాణీకరణ, సంస్థల మధ్య మెరుగైన సమన్వయం, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల అనుసంధానంపై దృష్టి సారించాయి. సమన్వయం, సాక్ష్యాధారిత చర్యల ద్వారా భారత ఫార్మకోవిజిలెన్స్, మెటీరియోవిజిలెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఐపీసీ నిబద్ధతను స్పష్టం చేస్తూ ఈ సమావేశం ముగిసింది.

# సింగరేణి క్వార్టర్లలో తప్పిన పెను ప్రమాదం

ఖమ్మం, మార్చి 2: పూజ గదిలో దేవుడి కోసం వెలిగించిన దీపం ఇంటిని దహనం చేసింది. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని గోపి ఏరియాలో సోమవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. అయితే రంజాన్ మాసం ఉపవాసంలో ఉన్న యువకుల సాహసంతో పెను ప్రమాదం తప్పింది. గోపి ఏరియాలోని క్వార్టర్ నం.ఆ-285లో నివసిస్తున్న గుత్తుల దుర్గాప్రసాద్ కుటుంబం పూజ గదిలో దీపాలు వెలిగించి బయటకు వెళ్లింది. కొద్ది సేపటికే పూజ గదిలో మంటలు చెలరేగి ఇంటి ఇతర గదులకు వ్యాపించాయి. ఒక్కసారిగా ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. మంటలు వంటగదిలోని గ్యాస్ సిలిండర్ వైపు చేరుతున్నాయని గమనించిన యువకులు అజార్, జాఫర్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా ఇంట్లోకి దూసుకెళ్లారు. రంజాన్ ఉపవాసంలో ఉండి, రోజంతా ఆహారం తీసుకోకపోయినా మండుతున్న వేడి, కళ్లను మండించే పొగను తట్టుకుని సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఒక్క చిన్న నిర్లక్ష్యం జరిగినా పెద్ద విషాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

ఇంటి పైకప్పు రేకులను పగలగొట్టి పైపులైన్ ద్వారా నీటిని చల్లుతూ మంటలను అదుపులోకి తెచ్చారు. వారి ధైర్యసాహసాల వల్ల మంటలు మరింత విస్తరించకుండా ఆగిపోయాయి. ఈ ఘటనలో ఇంటి సామగ్రి, మంచాలు, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలు కాలిపోయినా ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. రంజాన్ మాసంలో ఉపవాసంలో ఉన్నప్పటికీ "మనిషి ప్రాణమే ముందుగా" అన్న భావనతో ప్రాణాలను పణంగా పెట్టి ముందుకొచ్చిన ఈ యువకులను స్థానికులు అభినందిస్తున్నారు. మతం, కాలం, పరిస్థితి ఏమిటన్నది పక్కనపెట్టి మానవత్వం గెలిచిందని ప్రశంసిస్తున్నారు. ఈ ఘటన రుద్రంపూర్ ప్రాంతంలో యువతలో ఉన్న సేవాభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

# గత శతాబ్దాన్ని చమురు శాసించి ఉంటే, ఈ శతాబ్దాన్ని మైక్రోచిప్స్ శాసిస్తాయి: ప్రధాని

న్యూ ఢిల్లీ, మార్చి 2:గుజరాత్‌లోని సానంద్‌లో మైక్రాన్ అసెంబ్లీ, టెస్ట్, మార్కింగ్, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) కేంద్రాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభాన్ని సూచించే ఈ చారిత్రాత్మక ఘట్టం ప్రపంచ సాంకేతిక నాయకత్వం వైపు భారత్ భారత ప్రయాణంలో ఒక ముందడుగు.

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ఏఐ సమ్మిట్ తర్వాత, నేడు మనం మరో చారిత్రాత్మక మైలురాయిని చూస్తున్నామని ప్రధానమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. "ఏఐ సమ్మిట్ ద్వారా భారత ఏఐ సామర్థ్యం ప్రపంచానికి తెలిస్తే, నేటి సందర్భం సాంకేతిక నాయకత్వం పట్ల భారత అంకితభావానికి నిదర్శనం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

భారత్ ఒకప్పుడు ప్రధానంగా సాఫ్ట్‌వేర్, ఐటీ సేవలకు మాత్రమే గుర్తింపు పొందిందని, కానీ ఇప్పుడు హార్డ్‌వేర్ రంగంలో కూడా తన ముద్రను వేగంగా బలపరుచుకుంటోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "నేడు సానంద్‌లో ఒక కొత్త భవిష్యత్తు ప్రారంభాన్ని మనం చూస్తున్నాం. మైక్రాన్ ఏటీఎంపీ కేంద్రంలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడం ప్రపంచ సాంకేతిక విలువ శ్రేణిలో భారత పాత్రను మరింత బలోపేతం చేస్తుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

విధాన రూపకల్పన నుంచి ఉత్పత్తి వరకు మునుపెన్నడూ లేని వేగంతో పనులు జరుగుతున్న "నవ భారత్" ఆలోచనా విధానాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ వేగవంతమైన పురోగతిని వివరిస్తూ, జూన్ 2023లో అవగాహన ఒప్పందం కుదిరిందని, ఆ తర్వాత సెప్టెంబర్ 2023లో సానంద్‌లో భూమి పూజ జరిగిందని గుర్తుచేశారు. "ఫిబ్రవరి 2024 నాటికి పైలట్ కేంద్రంలో యంత్రాల ఏర్పాటు ప్రారంభమైంది, ఇది ఫిబ్రవరి 2026లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభానికి దారితీసింది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

భారతదేశం సంక్లిష్టమైన నియంత్రణ ప్రక్రియలను గణనీయంగా సరళీకరించిందని, అడ్వాన్స్‌డ్ ప్రైసింగ్ అగ్రిమెంట్లను (ఏపీఏ) కేవలం కొన్ని నెలల్లోనే విజయవంతంగా పూర్తి చేస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఇదే ప్రక్రియ పూర్తి కావడానికి సాధారణంగా మూడు నుంచి నుండి ఐదు ఏళ్ల సమయం పడుతుందని ఆయన గుర్తుచేశారు.

"సంకల్పం స్పష్టంగా ఉండి, దేశం వేగవంతమైన అభివృద్ధి పట్ల అంకితభావంతో ఉన్నప్పుడు, విధానాలు పారదర్శకంగా మారుతాయి. నిర్ణయాలు వేగం పుంజుకుంటాయి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఈ కేంద్రం భారత్, అమెరికాల మధ్య, ముఖ్యంగా ఏఐ, చిప్ టెక్నాలజీ రంగాలలో ఉన్న బలమైన భాగస్వామ్యానికి నిదర్శనమని ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికా ప్రపంచ సరఫరా వ్యవస్థ రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థను మరింత నమ్మకమైనదిగా మార్చేందుకు ఏఐ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న 'పాక్స్ సిలికా' ఒప్పందాన్ని ఒక ముఖ్యమైన ప్రయత్నంగా ఆయన ఉదహరించారు.

ఈ శతాబ్దం ఏఐ విప్లవ శతాబ్దమని పేర్కొంటూ, ఈ మార్పుకు సెమీకండక్టర్లే వారధి అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. చారిత్రక మార్పులను పోలుస్తూ, 20వ శతాబ్దాన్ని చమురు శాసించి ఉంటే, 21వ శతాబ్దాన్ని మైక్రోచిప్ శాసిస్తుందని శ్రీ మోదీ తెలిపారు. పారిశ్రామిక విప్లవాన్ని ఏఐ విప్లవంతో అనుసంధానించే మాధ్యమం ఒక చిన్న చిప్ అని ఆయన వివరించారు. "ఈ దార్శనికతతోనే సెమీకండక్టర్ రంగంలో దూకుడుగా ముందుకు సాగాలని భారత్ నిర్ణయించుకుంది. ప్రపంచం కోవిడ్ విలయంతో పోరాడుతున్న సమయంలోనే భారత్ తన సెమీకండక్టర్ మిషన్‌ను ప్రకటించింది. మహమ్మారి కాలంలో అంతా అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు, మనం నమ్మకంతో నాటిన విత్తనాలు ఇప్పుడు పెరిగి ఫలితాలను ఇస్తున్నాయి" అని శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు.

సెమీకండక్టర్ రంగం పట్ల భారత నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. సెమీకాన్ ఇండియా ప్రోగ్రామ్ కింద 10 ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, ఉత్తరప్రదేశ్, అసోం, ఒడిశా, పంజాబ్ సహా వివిధ రాష్ట్రాల్లో మరో మూడు ప్రాజెక్టులు త్వరలో ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "మనం నిర్మిస్తున్న ఈ వ్యవస్థ ఒక్క ప్రాంతానికే పరిమితం కాదు. ఇది అఖిల భారత వ్యాప్తం. 'వికసిత భారత్' కోసం దేశంలోని ప్రతి మూలలో కొత్త టెక్ హబ్‌లు అభివృద్ధి చెందుతున్నాయి" అని శ్రీ మోదీ తెలిపారు.

సెమీకండక్టర్ వ్యవస్థ అంటే కేవలం ఒక కర్మాగారం మాత్రమే కాదని, అందులో యంత్ర తయారీదారులు, డిజైన్ ఇంజనీర్లు, పరిశోధనా సంస్థలు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లు, నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు ఇలా అనేక విభాగాలు ఉంటాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వీటన్నింటి సమన్వయం ద్వారానే ఒక చిప్ తయారవుతుందని వివరించారు. "మొత్తం విలువ శ్రేణి పై భారత్ దృష్టి పెడుతోంది. ఇందుకోసమే ఈ ఏడాది బడ్జెట్‌లో 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0' ప్రకటించాం" అని ప్రధాని తెలిపారు. అభివృద్ధి స్థాయిని వివరిస్తూ, "ఉత్పత్తి పెరిగే కొద్దీ భారతదేశంలో ముడిపదార్థాలు, విడిభాగాలు, సేవల అవసరం కూడా పెరుగుతుంది. ఇదే అతిపెద్ద అవకాశం" అని శ్రీ మోదీ అన్నారు.

"భారత జనాభాలో చాలా పెద్ద సంఖ్యలో ప్రజలు మొదటిసారి గ్యాడ్జెట్లను వాడుతున్నారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ లేదా ఇతర సాంకేతికతలు ఏవైనా సరే, వీటికి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. 'మేక్ ఇన్ ఇండియా' ఇప్పుడు పూర్తి స్థాయిలో సాగుతోంది," అని శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో ఎలక్ట్రానిక్స్ రంగం ఉత్పత్తి, ఎగుమతులలో సాధించిన బహుముఖ వృద్ధిని వివరిస్తూ, "పెట్టుబడిదారులకు ఇటు దేశీయ మార్కెట్, అటు అంతర్జాతీయ అవకాశాలు సిద్ధంగా ఉన్నాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. సానంద్ ఆటోమొబైల్ హబ్‌గా మారిన తీరును ఉదహరిస్తూ, మైక్రాన్ కేంద్రం ఒక కొత్త సెమీకండక్టర్ వ్యవస్థకు పునాది వేస్తుందని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. గ్లోబల్ డేటా సెంటర్లు, ఏఐ అప్లికేషన్లు, మొబైల్ పరికరాల కోసం ఈ ప్లాంట్ డి-రామ్, నండ్ సొల్యూషన్లను ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఏటీఎంపీ క్లీన్‌రూమ్‌లలో ఒకటి ఇక్కడ ఉండటం, తక్కువ నీటి వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఆయన ప్రశంసించారు.

గుజరాత్ ప్రభుత్వ విధానాలను ప్రశంసిస్తూ, సెమీకండక్టర్ రంగం కోసం రూపొందించిన విధానాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇస్తున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. గుజరాత్ సాంకేతిక రంగంలో వేగంగా ముందుకు సాగడాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "అనుమతులు, భూమి కేటాయింపు, మౌలిక సదుపాయాల వంటి ప్రక్రియలను సరళీకరించడం పెట్టుబడిదారుల నమ్మకాన్ని బలపరిచింది. ధోలేరా, సానంద్ పశ్చిమ భారత దేశ సెమీకండక్టర్ క్లస్టర్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. సెమీకండక్టర్ రంగానికి అవసరమైన రసాయనాలు, పెట్రోకెమికల్స్ వంటి ముడిపదార్థాల పరిశ్రమలతో పాటు, నైపుణ్య శిక్షణ కేంద్రాలను కూడా సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రధానమంత్రి వివరించారు.

ప్రపంచ పెట్టుబడిదారులకు "భారత్ సిద్ధంగా ఉంది. భారత్ నమ్మకమైంది. భారత్ ఫలితాలను అందిస్తుంది" అనే శక్తిమంతమైన సందేశంతో ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తిరుగులేని మద్దతు ఉంటుందని ఆయన ప్రపంచ భాగస్వాములకు, పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు. ఈ దశాబ్దం భారత సాంకేతిక ప్రయాణంలో ఒక చారిత్రాత్మక మలుపు అని ఆయన పేర్కొన్నారు. "భారత్ సమర్థ వంతమైంది. భారత్ పోటీతత్వం కలది. భారత్ అంకితభావం కలిగింది" అనే స్పష్టమైన, దృఢమైన నిబద్ధతతో కూడిన ఆయన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించింది.

# గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత..

## -ఎమ్మెల్యే తాతయ్య

అమరావతి, మార్చి 2:మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె పండుగ 2.0 కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 5 గోకులం షెడ్డులను అలాగే గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు దిశగా వేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ప్రతి గ్రామానికి రోడ్లు, నీరు, వెలుగు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పల్లె పండుగ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, నవాబుపేట గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నంబూరి వెంకటేశ్వరరావు, చెరువు ప్రెసిడెంట్ గింజుపల్లి వెంకటయ్య, సొసైటీ చైర్మన్ చింతా వెంకటేశ్వరరావు (బుల్లి), విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జామా ఆనందరావు, విజయవాడ పార్లమెంటరీ తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి నల్లమోలు శివరామకృష్ణ ప్రసాద్ పెనుగంచిప్రోలు గ్రామ మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, అయిలపోగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాస ఆంధ్రులను సురక్షితంగా తీసుకురావాలి: వైఎస్ జగన్

అమరావతి, మార్చి 2: మధ్య ప్రాశ్చ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ప్రవాస ఆంధ్రులను సురక్షితంగా తీసుకురావాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాది మంది గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్నారని, ఇప్పుడున్న ఉద్రిక్త పరిస్థితుల్లో అక్కడ అనిశ్చితి నెల కొనడంతో పాటు, భద్రత కొరవడిందన్నారు. మరోవైపు పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు, విమాన సర్వీసుల రద్దు వల్ల చాలా మంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయి, అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.

రాష్ట్రానికి చెందిన వారందరినీ సురక్షితంగా ఇక్కడికి తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుని, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా వారందరినీ తరలించాలని కోరారు. ఇంకా గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలతో కూడా సమన్వయం చేసుకుని, ప్రవాస ఆంధ్రుల పరిరక్షణకు చర్య తీసుకోవాలని కోరారు.

అక్కడున్న వారి పరిస్థితిని ఎప్పుడికప్పుడు, వారి కుటుంబాలకు తెలియజేసే విధంగా ఏపీలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా అందుబాటులోకి తేవాలని సూచించారు.

# హాకర్లకు శాశ్వత పరిష్కారం చూపాలి..

**కార్పోరేషన్ అధికారులకు పుణ్య శిల వినతి..**

**-కూటమి ప్రభుత్వం నాయకుల ఒత్తిడి తో మాంగో మార్కెట్ హాకర్ల తొలగింపు**

**-నోటీసులు ఇవ్వకుండా హాకర్ల తొలగింపు హేయమైన చర్య**

**-జీవనం సాగిస్తున్న హాకర్లను రోడ్డు నా పడేసిన కూటమి నాయకులు**

**-కూటమి ప్రభుత్వం నాయకుల ఒత్తిడి హాకర్లను తొలగించిన కార్పోరేషన్ అధికారులు**

**-నష్టపోయిన హాకర్లకు శాశ్వత పరిష్కారం చూపాలీ**

**-34 వ డివిజన్ కార్పొరేటర్ బండి పుణ్యశిలా డిమాండ్**

విజయవాడ,మార్చి 2: విజయవాడలోని మ్యాంగో మార్కెట్ వద్ద ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిరు వ్యాపారుల తోపుడు బండ్లను ధ్వంసం చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బండి పుణ్య శీల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేదారేశ్వరరావుపేట 34 వ డివిజన్ పరిధిలో ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న హాకర్ల పట్ల అధికారులు నిర్దాక్షణ్యంగా వ్యవహరించారని ఆమె మండిపడ్డారు.

బాధిత వ్యాపారులతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లిన ఆమె, అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉదయం ప్రొక్లైన్లతో వచ్చి, కనీసం మరమ్మతులకు కూడా వీలు లేకుండా బండ్లను, చెరకు మిషన్లను విరగ్గొట్టడం దారుణమని ఆమె తన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ ఒత్తిడి తోనే కార్పోరేషన్ అధికారులు ఇలాంటి పైశాచిక చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. ట్రాఫిక్ సమస్య ఉంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరిష్కరించాలి తప్ప, పేదల జీవన భృతిని దెబ్బ తీయడం సరి కాదని పేర్కొన్నారు. నష్ట పోయిన వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని, వారందరికీ శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె డిమాండ్ చేశారు.




# సర్కిల్ వన్ పీజీఆర్ఎస్‌లో ఒకే ఒక అర్జీ దాఖలు..



విజయవాడ మార్చి 2: విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్ వన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గం లకు జోనల్ కమిషనర్ రమ్య కీర్తన ఆధ్వర్యంలో ప్రారంభమైంది. 48వ డివిజన్ గున్నబత్తుల అచ్చయ్యమ్మ వీధికి పొట్నూరి కృష్ణ ప్రసాద్ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ నిమిత్తం అర్జీ దాఖలు చేశారు.

ఆ అర్జీని జోనల్ కమిషనర్ రమ్య కీర్తన టౌన్ ప్లానింగ్ విభాగానికి పంపేరు. ఈ కార్యక్రమంలో ఈఈజె శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ రెవెన్యూ యువీబీ శర్మ, ఏ.ఎం.అండ్ హెచ్ ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఇంజనీరింగ్ ఏ ఈ పూర్ణచంద్రరావు, డీసీపీ వై. చంద్రబోస్, శానిటరీ సూపర్వైజర్ డి సోమరాజు, మలేరియా ఇన్స్పెక్టర్ లు, శానిటరీ ఇన్స్పెక్టర్ లు పార్క్ సూపర్వైజర్, టీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# 'సీసీ కెమెరాలు ఉంటే నేరాలు జరగవు.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి'

మెదక్, మార్చి 2:సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ టౌన్ సీఐ రవి కుమార్, బేగంపేట ఎస్ఐ డి. మహిపాల్ రెడ్డి, విపిఓ బి. ప్రేమరాజ్, ఏఎస్ఐలు హాజరై సీసీ కెమెరాలను ఆవిష్కరించారు.

గ్రామ సర్పంచ్ మద్దా గీతా ప్రవీణ్, ఉప సర్పంచ్, మంకిడి స్వామి, వార్డు సభ్యులు, దాతలు, గ్రామ ప్రజల సమక్షంలో కార్యక్రమం జరిగింది.

గ్రామంలో భద్రతా పరిరక్షణను బలోపేతం చేయడం, చోరీలు, ఇతర అనైతిక చర్యలను అరికట్టడం లక్ష్యంగా ఈ కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, భద్రతా వ్యవస్థ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని.. ప్రతీ గ్రామంలో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఉంటే నేరాలు జరగవని వారు పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమని. అంత టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బేగంపేట గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాయపోల్ మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని పేర్కొన్నారు.

# సంగీతం మన నాగరికతలో పవిత్ర గంగ లాగా ప్రవహిస్తోంది: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, మార్చి 2:కేరళలోని త్రిశూర్‌లో చేతన గానాశ్రమానికి ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ ఆశ్రమాన్ని అన్ని ధర్మాల ప్రజల ఆధ్యాత్మిక జాగృతికి ఉద్దేశించిన ఓ సంగీత, సాంస్కృతిక ప్రాంగణంగా తీర్చిదిద్దుతారు.

చేతన గానాశ్రమం కురియాకోస్ ఎలియాస్ సర్వీస్ సొసైటీ (కేఈఎస్ఎస్) చేపట్టిన ప్రాజెక్టు. అంతేకాదు, ఇది త్రిశూర్‌లోని సీఎమ్ఐ దేవమాత పబ్లిక్ స్కూల్ అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఒకటి.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ, భారత్‌లో వేల సంవత్సరాల నుంచీ సమృద్ధమైన సంగీత పరంపర అలరారుతోందన్నారు. "భారత్‌లో సంగీతం అంటే కేవలం శబ్దం కాదు.. అది ఒక ఆధ్యాత్మిక ప్రయాణం, ఓ ధ్యానం, ఓ ప్రార్థన, అంతేకాక జీవితాన్ని పండుగ చేసుకోవడం లాంటిది" అని ఉపరాష్ట్రపతి వర్ణించారు. సంగీతమంటే భారత ప్రాచీన నాగరికతకు సంబంధించిన ఆత్మను అత్యంత శుద్ధంగా వ్యక్తీకరించడం, లక్షలాది హృదయాల్ని పెనవేసే ఓ శక్తిమంతమైన బంధం అని ఆయన అన్నారు.

భారతీయ సంగీతానికున్న నాగరికతాపరమైన గాఢతను ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, వేద మంత్రాల మొదలు సాధువుల భక్తిపూరిత ప్రబోధాల వరకూ.. సంగీతం పవిత్ర గంగ లాగా దేశమంతటా ప్రవహిస్తోందన్నారు.

దక్షిణ భారతదేశంలో ఎంతో కాలం నుంచీ చైతన్యవంతమైన సంగీత సంస్కృతి మనగలుగుతూ వచ్చిందనడానికి చరిత్రలో నిదర్శనాలు ఉన్నాయని ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. వాటిలో చోళ రాజులు నిర్మించిన బృహదీశ్వర ఆలయంలోని శిలాశాసనాలు భాగమని తెలిపారు. ఆ శిలాశాసనాలు వందలాది సంగీతకారులతో పాటు నృత్యకారుల నియామకానికీ, వారు పొందిన మద్దతుకూ నిరూపణలుగా నిలిచాయి అని ఆయన అన్నారు. తేవరమ్ వంటి పవిత్ర స్తోత్రాలను ఆలయాల్లో క్రమం తప్పక ఆలపించే వారని వెల్లడించారు. ఇవన్నీ భారత సంగీత వారసత్వానికి ఉన్న శాశ్వతత్వాన్ని చాటిచెబుతున్నాయన్నారు.

భారత్‌లోని విభిన్న సంప్రదాయాల్ని గురించి ఉపరాష్ట్రపతి చెబుతూ.. హిందుస్తానీ, కర్నాటక శాస్త్రీయ సంగీతాల్ని ధ్వని తాలూకు లోతయిన విజన శాస్త్రాలుగా వర్ణించారు. శాశ్వతత్వాన్ని సంపాదించుకున్న త్యాగరాజు కీర్తనల్నీ, తాన్‌సేన్ అపార ప్రతిభనీ, ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి అజరామర గాత్రాన్నీ, రవి శంకర్ ప్రపంచవ్యాప్తంగా ప్రసరించిన ప్రభావాన్నీ ఆయన గుర్తు చేశారు. భారతీయ సంగీతం అనేక ఖండాల్లో శ్రోతలకు స్ఫూర్తిని అందించిందన్నారు.

పాశ్చాత్య సంగీతమైనా, లేక భారతీయ సంగీతమైనా ఏడు స్వరాలతో రూపొందిందేనని ఉపరాష్ట్రపతి అన్నారు. సప్త స్వరాల్లో మానవ భావోద్వేగాలు ప్రతిధ్వనిస్తాయి.. అవి శ్వాసను క్రమబద్ధం చేస్తాయి.. హృదయ స్పందనను నిలకడగా ఉంచుతాయి.. ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఏకాగ్రతను పెంపొందిస్తాయని ఆయన చెప్పారు. "ఉషోదయ సమయాన ఒక సుందర రాగం చెవి సోకినా, లేదా ఓ భక్తిభావం నిండిన భజన ఏ పవిత్ర స్థలాన్నయినా ఆవరించినా.. సంగీతం ఔషధంలా మారుతుంది" అని ఆయన అన్నారు.

సంగీత ధ్యానానికీ, చికిత్సకీ అంకితమయ్యే పర్యావరణమిత్రపూర్వక ప్రాంగణంగా చేతన గానాశ్రమాన్ని రూపుదిద్దాలని ప్రతిపాదించడం ప్రశంసనీయమని ఉపరాష్ట్రపతి అన్నారు. సప్త స్వరాల్లో ప్రతి ఒక్క ప్రత్యేక స్వరమూ భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి ఉంది. అయినప్పటికీ అవి కలిసికట్టుగా ఉంటూ మానవ జాతికి ఒక ప్రధాన పాఠాన్ని బోధిస్తున్నాయని ఆయన తెలిపారు.

గానాశ్రమంలో సమ్మిళిత నిర్వహణకు ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమని ఉపరాష్ట్రపతి అన్నారు. దీనిలో వేరు వేరు ధర్మాల వారికి ప్రాతినిధ్యాన్ని కల్పించారు.. ఉదాహరణకు శ్రీ కె.జె. యేసుదాస్ వంటి గాయకుడికి స్థానం కల్పించారంటూ ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. సంగీతం, ధ్యానాల ఆధ్యాత్మిక గొడుగు నీడ లోకి ప్రజలను తీసుకు రావడానికి గానాశ్రమం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.

అయిదు ఆలయాలను నిర్మించాలన్న ప్రతిపాదనను గురించి ఉపరాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. వాటిలో 'ధ్యానాలయం' (దీనిని సంగీత ధ్యానానికి ఉద్దేశించారు), 'సంగీతాలయం' (దీనిని నాడీశాస్త్ర విజ్ఞ?న సంబంధిత సంగీత చికిత్సకి ఉద్దేశించారు), 'శబ్దాలయం' (దీనిని ధ్వని చికిత్సకు ఉద్దేశించారు), 'కళాలయం' (దీనిని భారతీయ సంగీత, నాట్యాలకు ఉద్దేశించారు), 'యోగాలయం' (దీనిని యోగ చికిత్సకు ఉద్దేశించారు) ఉన్నాయని వెల్లడించారు. ఈ సంస్థ ఎంతో మందిని మేలుకొలిపి, స్వస్థతను చేకూర్చగలుగుతుందన్న విశ్వాసం తనకు ఉందని ఆయన చెప్పారు.

యోగాకు గల ప్రాచీన జ్ఞ?నం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదర్శి నాయకత్వంలో ప్రపంచమంతటా మున్నెన్నడూ ఎరుగనంత గుర్తింపును సంపాదించుకోవడంతో పాటు, భారత సాఫ్ట్ పవర్‌కు ఒక సంకేతంగా ఎదిగిందని ఉపరాష్ట్రపతి అన్నారు. భారత నాగరికతలోని 'వసుధైవ కుటుంబకమ్' తాత్త్వికతను యోగా ప్రతిబింబిస్తోందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సంగీత సంప్రదాయాల మార్పిడి కోసం చైతన్యవంతమైన వేదికల్ని రూపొందించిందనీ, వాటితో భిన్నత్వంలో ఏకత్వం బలోపేతమైందనీ, భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచ నలుమూలలా వేనోళ్ల ప్రశంసలు దక్కుతున్నాయనీ ఉపరాష్ట్రపతి అన్నారు.

వేగంగా ముందుకు సాగిపోతున్న, తరచుగా ఒత్తిళ్లకు లోనవుతున్న నేటి ప్రపంచంలో, సంగీతానికున్న చికిత్సాత్మక శక్తి ఇదివరకటి కన్న ప్రస్తుతం మరింత ఎక్కువ సందర్భ శుద్ధిని సంతరించుకొంది అని ఉపరాష్ట్రపతి తన ప్రసంగం ముగింపు సందర్భంగా స్పష్టం చేశారు. చేతన గానాశ్రమం గొప్పగా విజయవంతమవ్వాలని ఆకాంక్షించారాయన. 'స, రి, గ, మ, ప, ద, ని..' ఈ ఏడు స్వరాల నిత్య తరంగాలు ప్రజల మనసులకు ఓదార్పునందిస్తూ, మానవ జాతి సద్భావన మార్గంలో సాగేలా మార్గదర్శనం చేస్తూనే ఉంటాయన్న ఆశాభావాన్ని ఉపరాష్ట్రపతి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్న వారిలో.. కేరళ గవర్నరు శ్రీ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, కేంద్ర పెట్రోలియమ్, సహజ వాయువుల శాఖ, పర్యటక శాఖ సహాయ మంత్రి శ్రీ సురేశ్ గోపి, కేరళ ప్రభుత్వ ఉన్నత విద్య శాఖ, సాంఘిక న్యాయ శాఖ మంత్రి డాక్టర్ ఆర్. బిందు, త్రిశూర్ నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ నిజీ జస్టిన్, త్రిశూర్ ముఖ్య క్రైస్తవ మత గురువు శ్రీ మార్ ఏండ్రూస్ థజాథ్, ప్రావిన్సియల్, త్రిశూర్‌లోని సీఎంఐ దేవమాత ప్రావిన్స్‌కు చెందిన ప్రావిన్సియల్ డాక్టర్ జోస్ నందిక్కార, చేతన గాన-ఆశ్రమం కార్యనిర్వాహక డైరెక్టరు డాక్టర్ పాల్ పూవథింగల్ తదితర ప్రముఖులు ఉన్నారు.

# అక్రమ కలప పట్టివేత



అమరావతి, మార్చి 2:దండేపల్లి మండలంలోని మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కలపను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందుతులు ఊట్ల గ్రామం నుండి దండేపల్లికి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో మాటు వేసి బైకును వెంబడించగా కలప స్మగ్లర్ బైక్ వదిలి పెట్టి పరారయ్యారు. 25వేల విలువ గల నాలుగు టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు మెదరిపేట సెక్షన్ ఆఫీసర్ రాజేందర్ తెలిపారు. పట్టుకున్న కలప, బైక్ ను తాళ్ల పేట రేంజ్ కు తరలించినట్లు ఆయన వెల్లడించారు, ఈ కార్యక్రమంలో,ఫారెస్టు బీట్ ఆఫీసర్ మధు,చిన్నయ్య,బేస్ క్యాంపు వాచర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక మహిళా పోరాట దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అమరావతి, మార్చి 2:గ్రామీణ ప్రాంతాలలో శ్రామిక మహిళల ఉపాధిని దెబ్బతీయడానికి కారణమైన మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన వీ బీ జీ రాం జీ చట్టానికి వ్యతిరేకంగా మార్చి 1నుండి 8 వరకు పీ ఓ డబ్ల్యూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాలను గ్రామ గ్రామాన విజయవంతంగా జరపాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీ ఓ డబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం శ్రామిక వర్గ మహిళల ఉపాధిని దెబ్బతీయడానికి పూనుకున్నదని ఆరోపించారు. పనిభారాన్ని మోపుతూ, వారి శ్రమను దోచుకునేందుకు అదనపు పని గంటలు పెంచుతూ, కార్పొరేట్లకు ఊడిగం చేసే విధానాలను అమలు చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మహిళా పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకముకు పేరు మార్చి, రోజులు పెంచి, బడ్జెట్లో కోతలు విదిస్తూ,రాష్ట్రాలపై ఆర్థిక భారాలను పెంచి క్రమంగా ఆ పథకాన్ని రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఇది 26 లక్షల కోట్ల ఉపాధి జాబ్ హోల్డర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు,వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా పని దొరికేది మహిళలకు, దళిత, ఆదివాసి, గిరిజనులకు మాత్రమేనని ఆ పథకం రద్దు చేస్తే ఆ సామాజిక వర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం అశేష కార్మిక వర్గం తో పాటు మహిళా కార్మిక వర్గం హక్కులు కోల్పోతారని, అదనపు పని గంటలను భరించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ సుగుణ,జిల్లా నాయకురాలు, మందనపల్లి ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ, గడ్డం పద్మ, తమ్మడి మాధవి,ఇక్కిరి మాధవి, కొమ్మిడి లత పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

కరీంనగర్, మార్చి 2: గోదావరి పుష్కరాలకు సంబంధించి జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్ల ఫైనల్ ప్రతిపాదనలు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు అరించేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం చేయాలని, రోడ్డు విస్తరణ, లైటింగ్, పార్కింగ్, ఆలయాల వద్ద అభివృద్ధి, తదితర అంశాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

గోలివాడ, మంథని, గోదావరిఖని, సుందిళ్ల వంటి ప్రాంతాలలో గోదావరి నది ప్రవాహం ఉంటుందని అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ రాంరెడ్డి, ఆర్అండ్ బీ ఈఈ భావ్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం విలువలను పెంచేలా పనిచేయాలి - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 2: నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రింట్ మీడియా ప్రధాన పత్రికల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు పాత్రికేయుల అభ్యున్నతికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని తెలిపారు. ప్రజా సమస్యలు, ఇబ్బందులను ఎప్పటి కప్పుడు వెలికి తీసి జర్నలిజం విలువలను పెంచేలా పని చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లయన్ జ్యోతిర్మయచారి ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాలరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డమీది బాల్‌రాజ్‌గౌడ్, కార్యదర్శి రోజారాణి, క్లబ్ సలహాదారులు కమిటీ ప్రతినిధులు చంద్రమౌళి, కేసీ మోహన్, క్యాసాని సత్యనారాయణ, కడియాల రమేష్, శ్రీనివాస్‌రావు, ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, సహదేవచారి, నర్సింగ్ గౌడ్, గుమ్మడి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సహజమైన రంగులతో ముందస్తు హోలీ వేడుకలు

కరీంనగర్, మార్చి 2: వీణవంక మండలంలోని హిమ్మత్నగర్ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సహజసిద్ధమైన రంగులతో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గోనె సత్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గోగిపువ్వు తీసుకువచ్చి రంగులు తయారు చేసి, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంతోషంగా హోలీ వేడుకలు నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంగా హెచ్ఎం గోనె సత్యం మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దేశ ప్రజలంతా జరుపుకునే ఈ హోలీ వేడుకలు సోదర భావానికి ప్రతీక అని, విద్యార్థులతో కలిసి హోలీ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, రజిత, అంగన్వాడీ టీచర్లు లావణ్య, స్వరూప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాచాపూర్ పాఠశాల స్ఫూర్తితో మధ్యాహ్నం భోజనం అందించాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



కరీంనగర్, మార్చి 2:జూలపల్లి మండలం కాచాపూర్ ప్రభుత్వ పాఠశాల స్ఫూర్తితో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. మధ్యాహ్నం భోజనం అందించడంలో రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన కాచాపూర్ పాఠశాల సిబ్బందిని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు.


కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశీలనలో 3 పాఠశాలలకు రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు వచ్చినట్లు తెలిపారు. కాగా అందులో పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఒక్కటని వెల్లడించారు. అనంతరం అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పీఎం షేక్, జూలపల్లి మండల విద్యాధికారి సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి లను జిల్లా కలెక్టర్ సన్మానించారు.

# మంగళ్‌తండాలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



ఖమ్మం, మార్చి 2:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని మంగళ్ తండా సమీపంలో గల చేనులో 25 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. గ్రామ సమీప చేనులో 25 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై టేకులపల్లి ఏఈ హాట్కర్ దేవా టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాపర్ వైర్ దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు. గడిచిన నెల రోజుల క్రితం సైతం మండలంలోని పెట్రాంచెలక సమీపంలో గల 25 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ల వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

# తొలి రోజు ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ అంకిత్ ఝలక్



ఖమ్మం, మార్చి 2:భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ అంకిత్ తొలి రోజు ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు అధికారులు అందరూ హాజరు కావాలని అంతకుక్రితం రోజే ప్రకటన జారీ చేశారు. అయినా 11 గంటల వరకు సైతం కొద్దిమంది జిల్లా అధికారులు మాత్రమే ప్రజావాణికి హాజంయ్యారు. ఎప్పటిలాగే పలువురు అధికారులు హాజరు కాలేదు. అప్పటికే 11 దాటడంతో అధికారుల నుండి అటెండెన్స్ తీసుకోమని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వచ్చిన వారు, వివిధ శాఖల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సంతకాలు పెట్టారు. ఇది గమనించిన కలెక్టర్ జిల్లా అధికారులు మాత్రమే సంతకాలు పెట్టిన షీట్ ఇవ్వాలని చెప్పడంతో అధికారులు తడబడి అప్పటికప్పుడు వేరే షీట్‌పై సంతకాలు చేసి మధ్యాహ్నం 12 గంటల్లోపు అటెండెన్స్ షీట్‌ను కలెక్టర్‌కు చేరవేశారు.

అనంతరం కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలకు తగు పరిష్కారాలు సూచించారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ.. ప్రతీ అధికారి తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావాలన్నారు. తప్పని పరిస్థితి అయితే ముందుగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన. హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు. డీపీఓ దిలీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అమరావతి, మార్చి 2:వన్య ప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని తాళ్లపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి. సుష్మారావు అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తపాల్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల మనుగడపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

అడవుల్లో చాలా రకాల జీవజాతులు నివసిస్తున్నాయన్నారు సుష్మారావు . జీవ వైవిధ్యంతో మానవ మనుగడ అడవులతో ముడిపడి ఉందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం దుంపల తిరుపతి,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు నహీదాఫర్వీన్,శంకర్, ఉపాధ్యాయులు తుంగూరి గోపాల్ చంద్రిక, రాజేందర్, రామారావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 'మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం'

నల్గొండ, మార్చి 2: 28: మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని ఆర్.ఎస్.వి ఫంక్షన్ హాల్‌లో యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాతృదేవోభవ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిబిరంలో సుమారు 300 మందికి పైగా రోగులకు గుండె, ఎముకల వ్యాధులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించారు.

# పీఎం-అభిమ్ పథకం కింద తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగుల కోసం మూడు క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు నేడు శంకుస్థాపన చేశాను: ప్రధాని

న్యూ ఢిల్లీ, మార్చి 2:పుదుచ్చేరిలో రూ. 2,700 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం రవాణా వంటి కీలక రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచనున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. "సిద్ధులు, సాధువులు, కవులు, స్వాతంత్ర్య సమరయోధుల నిలయం పుదుచ్చేరి. ఇక్కడే మహాకవి సుబ్రహ్మణ్య భారతి జాతీయవాద స్ఫూర్తిని రగిలించగా.. శ్రీ అరబిందో, మదర్... ప్రపంచానికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందించారు" అని వ్యాఖ్యానించారు.

పుదుచ్చేరికి సంబంధించిన తన 'బెస్ట్ (బీఈఎస్‌టీ)' సూత్రాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఇది వ్యాపారం (బిజినెస్), విద్య (ఎడ్యుకేషన్), ఆధ్యాత్మికత (స్పిరిచువాలిటీ), పర్యాటకాన్ని (టూరిజం) తెలియజేస్తోంది. "గడిచిన నాలుగున్నర ఏళ్లలో ఈ దార్శనికత సుపరిపాలన, అభివృద్ధికి దారితీసింది. తలసరి ఆదాయం పెరగడమే కాకుండా దేశంలోనే అత్యున్నత సామాజిక పురోగతి సూచిక స్కోరును పుదుచ్చేరి సాధించటమే దీనికి నిదర్శనం" అని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి మాట్లాడిన ప్రధాని.. ఈ ఏడాది దీని కోసం బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో రూ. 12 లక్షల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. "ఇంతకుముందు కేవలం రాష్ట్రాలకే పరిమితమైన 'రాష్ట్రాలకు పెట్టుబడి వ్యయం విషయంలో ప్రత్యేక సహాయం' పథకంలోకి ఇప్పుడు పుదుచ్చేరిని కూడా చేర్చాం. ఇది రోడ్లు, తాగునీటి సరఫరా, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మరిన్ని నిధులు అందేలా చూస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

యువ శక్తిని ప్రస్తావించిన ప్రధానమంత్రి.. "బలమైన, సాధికారత కలిగిన యువతే మన వృద్ధికి ఆధారం. వారి కలలకు అండగా నిలిచేందుకు మేం కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఎన్ఐటీ కరైకల్‌లో కొత్తగా ప్రారంభించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ బ్లాక్, అత్యాధునిక హాస్టల్ సదుపాయాలతో పాటు పాండిచ్చేరి యూనివర్సిటీలో చేపట్టిన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనులు సాంకేతిక విద్యను బలోపేతం చేయటంతో పాటు వేలాది మంది విద్యార్థులకు అండగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేసిన ప్రక్రియ అనంతరం ప్రజా సేవల్లో చేరిన యువతకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచమంతా స్వచ్ఛ, హరిత రవాణాపై దృష్టి సారిస్తోందన్న ప్రధానమంత్రి.. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారుతున్నాయని అన్నారు. పుదుచ్చేరి వంటి పర్యాటక కేంద్రంలో 'పీఎం ఈ-బస్ సేవా' కింద ఈ రోజు అందించిన ఎలక్ట్రిక్ బస్సులు కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. కుటుంబాలకు స్థిరత్వంతో పాటు గౌరవప్రదమైన జీవితాన్ని అందించే గృహ నిర్మాణ ప్రాజెక్టులతో పాటు పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాంలలో వందల కోట్ల విలువైన ఇతర అభివృద్ధి పనుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. వీటిలో స్వచ్ఛమైన తాగునీటిని అందించే లవణం హిత (డీసాలినైజేషన్) కేంద్రాలు, వ్యర్థాల నిర్వహణను మెరుగపరిచే మురుగునీటి శుద్ధి కేంద్రాలు, వర్షాకాలంలో వరద ముంపు సమస్యను తగ్గించే పనులు ఉన్నాయి. "మా పనులన్నీ పుదుచ్చేరి ప్రజల జీవన సౌలభ్యాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా సాగుతున్నాయి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

మానవ వనరులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ దేశమైనా పురోగమించగలదని.. అందుకే ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి ప్రముఖంగా చెప్పారు. వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరికీ లభించాలని, తక్కువ ఖర్చుతో ఉండాలనేది తమ సంకల్పమని తెలిపిన ఆయన.. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఇప్పటికే కోట్ల కుటుంబాల విషయంలో ఈ దార్శనికత సాకారం అవుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పుదుచ్చేరి ప్రజలెవరూ చికిత్స కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదన్న ఆయన.. ఇప్పటికే తొమ్మిది వైద్య కళాశాలలు ఉన్న ఈ ప్రాంతానికి 'వైద్య పర్యాటక కేంద్రం'గా మారే సామర్థ్యం ఉందని అన్నారు. వైద్యారోగ్య సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు జిప్మర్‌లోని ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు తెలిపిన ఆయన.. అత్యవసర సేవలను మెరుగుపరచడానికి 'పీఎం-అభిమ్' కింద పుదుచ్చేరి, కరైకల్‌లలో మూడు క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కరైకల్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి.. సిద్ధ వైద్యం, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణలో ఈ ప్రాంతానికి ఉన్న ఖ్యాతిని మరింత పెంచుతుందని అన్నారు. "పుదుచ్చేరి వైద్యారోగ్య పర్యాటక కేంద్రంగా మారగలదని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

గ్రామీణ, పట్టణ మౌలిక సదుపాయాలపై దృష్టి సారించే అనుసంధానత పురోగతికి వెన్నెముక అని ప్రధాని అన్నారు. విద్యార్థులు, రైతులు, చిన్న వ్యాపారులకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు వందల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. "పుదుచ్చేరి నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి రూ. 1,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. ఇందులో రూ. 440 కోట్ల వ్యయంతో నిర్మించే కొత్త పైవంతెన కూడా ఉంది" అని ప్రధాని ఉద్ఘాటించారు. తూర్పు తీర రహదారి, గ్రాండ్ సదరన్ ట్రంక్ రోడ్ల ద్వారా చెన్నైకి ప్రయాణ సమయాన్ని రెండు గంటల లోపుకు తగ్గించేలా అనుసంధానతను మెరుగుపరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "కన్యాకుమారి వరకు తూర్పు తీర కారిడార్‌లో రూ. 30,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టడం ద్వారా ఈ ప్రాజెక్టులు పుదుచ్చేరిని బెంగళూరు, కోయంబత్తూర్ వంటి ప్రధాన ఆర్థిక కేంద్రాలతో అనుసంధానిస్తాయి. ఇది పర్యాటకం, వాణిజ్యం, పరిశ్రమలకు గణనీయమైన ఊతాన్ని ఇస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు.

పుదుచ్చేరి అతిపెద్ద బలాలలో పర్యాటకం ఒకటని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఇది ఇప్పటికే వేలాది మంది సందర్శకులను ఆకర్షించే ఒక ప్రముఖ వారాంతపు పర్యాటక కేంద్రంగా నిలుస్తోందని ఆయన అన్నారు. ఇక్కడి ప్రజల ఆత్మీయత వల్లే ఈ విజయం సాధ్యమైందని.. ఈ ప్రాంతానికి వచ్చే రైళ్లు, విమానాలు నిరంతరం నిండుగా ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు. "ఆధ్యాత్మిక, పర్యావరణ, ఆరోగ్య పర్యాటకంపై ప్రభుత్వం ప్రత్యేక పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈ రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రసాద్ పథకం కింద వివిధ ఆలయాలలో తీర్థయాత్ర సౌకర్యాల అభివృద్ధిని చేపడుతున్నాం" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆరోవిల్‌ను 'విశ్వ చైతన్య నగరం' అనే దార్శనికతతో శ్రీ అరబిందో, మాత(ది మదర్) చూశారన్న ప్రధాని.. ఈ రోజు అక్కడ ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం ప్రారంభం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి సమ్మేళనాలు వివిధ ప్రాంతాలు, మతాల ప్రజలను ఏకం చేయడానికి దోహదపడతాయని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పుదుచ్చేరి ఒక విడదీయలేని భాగమన్న ప్రధాని.. ఎందరో మహోన్నత నాయకులకు ఇది జన్మభూమిగా లేదా కర్మభూమిగా నిలిచిందని గుర్తు చేశారు. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందటంలో ఈ గడ్డ అత్యంత కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. 2047 నాటికి 'వికసిత పుదుచ్చేరి', 'వికసిత భారత్'ను తయారు చేయటమే తమ లక్ష్యమని అన్నారు. ఈ దిశగా 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 'మేం ఎల్లప్పుడూ బెస్ట్ పుదుచ్చేరి కోసం కృషి చేస్తూనే ఉంటాం' అంటూ ప్రధానమంత్రి ప్రసంగాన్ని ముగించారు.

# ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు.. స్కూల్ బస్సు ఢీకొని మృతి




నల్గొండ, మార్చి 2: 28:నల్లగొండలో సోమవారం హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో ప్రైవేట్ స్కూల్ బస్సు నిర్లక్ష్యానికి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఇంటర్మీడియట్ పరీక్ష రాసేందుకు శాలిగౌరారం మండలం బండమీదిగూడెం గ్రామానికి చెందిన గైగుల్ల వంశీ (20), ఉట్కూర్ గ్రామానికి చెందిన గుడిసె రవి (20) బైక్‌పై నల్లగొండకు బయల్దేరారు. చందనపల్లి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఎస్పీఆర్ స్కూల్‌కు చెందిన బస్సు అకస్మాత్తుగా యూ-టర్న్ తీసుకుని విద్యార్థులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. వంశీ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదా బాబు తెలిపారు.

# వికసిత భారత్ కోసం వికసిత తమిళనాడు మన సమష్టి లక్ష్యం

న్యూ ఢిల్లీ, మార్చి 2:తమిళనాడులోని పవిత్ర నగరం మదురైలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ రూ.4,400 కోట్లకు పైగా విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిండంతోపాటు కొన్నిటిని జాతికి అంకితం చేసి, మరికొన్నిటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ- తమిళనాడు ప్రగతి ప్రస్థానంలో నేటి కార్యక్రమం ఒక గర్వించదగిన అధ్యాయమని ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో అనుసంధానం మెరుగుదల, ఆర్థిక వ్యవస్థ వృద్ధి, యువతకు గణనీయ ఉద్యోగావకాశాల కల్పన, లక్షలాది జనజీవన సౌలభ్య కల్పనే ఈ ప్రాజెక్టుల లక్ష్యమన్నారు. అధిక నాణ్యతగల మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన ధ్యేయం ప్రజలకు సాధికారత నివ్వడమేనని ప్రధాన మంత్రి వివరించారు. "రైతులకు మార్కెట్లను చేరువ చేయడం, రహదారుల మెరుగుదల, యాత్రిక-పర్యాటకులకు ప్రయాణ సౌలభ్యం, వ్యాపారాలకు వేగవంతమైన రవాణా" వంటి ప్రయోజనాలు సమకూరుతాయని అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

"గడచిన పన్నెండేళ్లుగా తమిళనాడు హైవే నెట్‌వర్క్‌లో కేంద్ర ప్రభుత్వం గణనీయ పెట్టుబడులు పెట్టింది. ఈ క్రమంలో 2014 నుంచి 4 వేల కిలోమీటర్లకు పైగా హైవేలు నిర్మితమయ్యాయి" అని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మరక్కణం-పుదుచ్చేరి సెక్షన్ 4 వరుసల రహదారితోపాటు తీరప్రాంత పర్యాటకం, వాణిజ్యాల బలోపేతానికి రూ.2,100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే, పరమకుడి-రామనాథపురం మార్గాన్ని 4 వరుసలుగా విస్తరించేందుకు రూ.1,800 కోట్లకు పైగా పెట్టుబడి పెడతారని పేర్కొన్నారు. ఈ రెండో ప్రాజెక్ట్ వల్ల రామేశ్వరం, ధనుష్కోటి వంటి ప్రదేశాలకు ప్రయాణ సౌలభ్యం గణనీయంగా మెరుగవుతుందని చెప్పారు. అంతేకాకుండా వ్యవసాయ, సముద్ర ఉత్పత్తుల నిరంతర రవాణాకు భరోసా ఇస్తుందని ఆయన తెలిపారు.

గత దశాబ్దంలో రైల్వే రంగంలో చారిత్రక మార్పులు వచ్చాయని ప్రధానమంత్రి చెప్పారు. ఈ మేరకు "తమిళనాడులో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది. మేం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రైల్వేలకు బడ్జెట్ కేటాయింపులు దాదాపు 9 రెట్లు పెరిగాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. అంటే- 2009-2014 మధ్య సగటు వార్షిక కేటాయింపు రూ.880 కోట్లు కాగా, 2026?27లో రూ.7,600 కోట్లకు పెరిగిందని ప్రధానమంత్రి గణాంకాలను ఉటంకించారు. రాష్ట్రంలో 1,300 కిలోమీటర్లకు పైగా కొత్త రైలు మార్గాలు వేయగా, విద్యుదీకరణ పనులు 97 శాతం పూర్తయిందని, వందలాది ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో భద్రత, సామర్థ్యం ఇనుమడించాయని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ఓ కీలక ఘట్టాన్ని ప్రస్తావిస్తూ- నిరుడు దేశంలో తొలి నిట్టనిలువుగా తెరచుకునే 'పంబన్' కొత్త వంతెనను ప్రారంభించడం తనకు లభించిన అదృష్టమని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు.

తమిళనాడు ప్రజలకు ప్రస్తుతం 9 వందే భారత్, మరో 9 అమృత భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇవి చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారవుతుండటాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 'మేక్ ఇన్ ఇండియా' దృక్కోణం మనకు గర్వకారణమంటూ- "దీని ద్వారా స్వావలంబన ఇనుమడిస్తోంది... యువతకు ఉద్యోగావకాశాలు అందివస్తున్నాయి" అని చెప్పారు. అమృత భారత్ స్టేషన్ పథకం కింద సౌకర్యం, సౌలభ్యం, స్థానిక గుర్తింపు సమ్మేళనంగా రాష్ట్రంలోని 77 స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సుందరంగా రూపుదిద్దుకున్న 8 స్టేషన్లను ఇవాళ ప్రారంభించామని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇక చెన్నై బీచ్-చెన్నై ఎగ్మూర్ నాలుగో లైన్‌ను జాతికి అంకితం చేసినందున వేలాది రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కుంభకోణం, ఏర్కాడు, వెల్లూరులలో ఆకాశవాణి కొత్త 'ఎఫ్ఎం' రిలే ట్రాన్స్‌మిటర్లను ప్రధానమంత్రి ప్రారంభించి, దేశానికి అంకితం చేశారు.

గత దశాబ్దంతో పోలిస్తే తమిళనాడులో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు 3 రెట్లు పెరగడమే కాకుండా 2026 కేంద్ర బడ్జెట్ కూడా ఈ రాష్ట్రంపై దృష్టి నిలిపిందని ప్రధానమంత్రి వివరించారు. బెంగళూరు-చెన్నై, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు కారిడార్లకు ప్రతిపాదనలు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను విప్లవాత్మకంగా తీర్చిదిద్దడానికి సిద్ధమవుతున్నాయని చెప్పారు. "ఈ బడ్జెట్ తమిళనాడును అరుదైన ఖనిజాల రంగంలో అగ్రభాగాన నిలిపింది. అధునాతన తయారీ, పరిశోధన-సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడం దీని లక్ష్యం" అని ప్రధానమంత్రి విశదీకరించారు.

తమిళనాడుకు సుసంపన్న చరిత్ర, వారసత్వం ఉన్నాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆదిచనల్లూర్ వంటి చారిత్రక ప్రదేశాలను ప్రపంచ వారసత్వ గమ్యాలుగా రూపొందిస్తామని ప్రకటించారు. పులికాట్ సరస్సుతోపాటు పోదిగై మలై చుట్టూ చేపడుతున్న పర్యావరణ పర్యాటక కార్యక్రమాలు సహజావరణ వ్యవస్థలను సంరక్షించడమే కాకుండా కొత్త ఉద్యోగ అవకాశాలను కూడా సృష్టిస్తాయని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. అలాగే, తయారీ రంగానికి నవ్యోత్తేజం ఇచ్చే దిశగా దేశంలోని సుమారు 200 పారిశ్రామిక సముదాయాలను గుర్తించి చేయూతనిస్తామని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు అనేక పరిశ్రమలకు నిలయం కావడం వల్ల ఈ పథకం కింద స్థానిక యువతకు గణనీయ ప్రయోజనం సమకూరుతుందని ప్రధానమంత్రి తెలిపారు.దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దే సంకల్ప స్ఫూర్తితో ప్రతి భారతీయుడు ముందడుగు వేయాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. ఈ స్వప్న సాకారంలో తమిళనాడు నిర్ణయాత్మక పాత్ర పోషించగలదని తెలిపారు. సమగ్రాభివృద్ధి, రాష్ట్ర పురోగమనం విషయంలో కేంద్రం పూర్తి నిబద్ధతతో ఉందని పునరుద్ఘాటిస్తూ- "వికసిత భారత్ కోసం వికసిత తమిళనాడు మన సమష్టి లక్ష్యం" అని వ్యాఖ్యానిస్తూ ఆయన తన ప్రసంగం ముగించారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు

మంచిర్యాల, మార్చి 2:: అక్రమ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది.

అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందింది. అయితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ అడ్డుకుని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు మరో 20 మందిపై అక్రమ కేసులు బనాయించి జైలులో బంధించింది.

# విద్యలో విద్యార్థుల దినదినాభివృద్ధి ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది

## – లయన్ కెప్టెన్ డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి,




హైదరాబాద్, మార్చి 2:విద్యార్థులు విద్యలో చూపించే దినదిన అభివృద్ధి వారు ఎంచుకున్న లక్ష్యాలకు చేర్చడానికి దోహదపడుతోందని, క్రమశిక్షణ కలిగిన జీవనశైలి విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు కెప్టెన్: డాక్టర్: లయన్: బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన దుర్శేడు ప్రభుత్వ పిఎం శ్రీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు లీడ్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోటివేషనల్ స్పీకర్ కెప్టెన్ లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. విద్యార్థులు చెడు అలవాట్లను త్వరగా గ్రహిస్తారని వాటికి దూరంగా ఉండి వారు ఏర్పరచుకున్న లక్ష్యాలను చేరడానికి ప్రతినిత్యం కష్టపడాలన్నారు. రోజులోని 24 గంటల్లో పాఠశాలకు ఎనిమిది గంటలు, నిద్రకు ఎనిమిది గంటలు పోగా మిగిలిన ఎనిమిది గంటల్లో ఎక్కువ సమయాన్ని చదువుల కోసం కేటాయించిన వారే ఉన్నత లక్ష్యాలను చేరుకొని ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. విద్యార్థి తనను తాను తెలుసుకొని తనలోని చెడు లక్షణాలైనా అలసత్వం, దురలవాట్లు, సోమరితనాన్ని దూరం చేసుకుని తనను తాను జయించినప్పుడే విజయాలు తనకు దాసోహమైతాయన్నారు. ఇప్పుడు టెన్త్ చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు ఆరు సంవత్సరాలలో డిగ్రీ పట్టాలను పొంది ఎంచుకున్న ఉద్యోగ లక్ష్యాన్ని సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండి అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశిష్ఠ అతిధి డాక్టర్ వి శ్రీనివాస్ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఫోబియో ఉంటుందని పరీక్షలు అంటే భయం లేకుండా చదివి పరీక్షల్లో రాణించాలని అన్నారు. ఉన్నత చదువులకు 10వ తరగతి ఒక మెట్టు మాత్రమే అని, దానిని అత్యున్నత మార్కులతో పూర్తి చేయాలని సూచించారు. మనిషి ఉన్నతిని విద్య మాత్రమే నిర్ధారిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రత్నాకర్ రావుతో పాటు ఉపాధ్యాయులు, 180 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# నేడు తిరుమల ఆలయం మూసివేత.. అన్ని రకాల దర్శనాలు రద్దు..



తిరుపతి, మార్చి 2: రేపు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం తలుపులను మూసివేస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆలయాన్ని పూర్తిగా మూసివేయనున్నట్లు ప్రకటించారు. రేపు జరగాల్సిన వీఐపీ బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలను పూర్తిగా రద్దుచేశారు. సోమవారం రాత్రి వరకు మాత్రమే భక్తులను క్యూలైన్లలోకి అనుమతించనున్నారు. తిరుపతిలో జారీచేసే రేపటి కోటా సర్వదర్శనం టోకెన్లను కూడా రద్దు చేస్తున్నట్లు స్పష్టంచేశారు. రేపు చంద్రగ్రహణం ఉన్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

మరోవైపు తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లన్నీ నిండిపోయాయి. భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్ల వరకు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం లభించడానికి సుమారు 12 గంటల సమయం పడుతోంది. నిన్న ఒక్కరోజే 83,122 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా.. 30,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు.

